మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, మార్చి 28 ప్రభాతవార్త :** యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఈబిసి/ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కలిపించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 2025 ఏప్రిల్ 5 లోపు ఓబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా తమకు వర్తించే సంబంధిత కార్పొరేషన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్పొరేషన్ల వారీగా పథకాల వివరాలు పోర్టల్‌లో పొందుపర్చబడినందున, దరఖాస్తుదారులు జాగ్రత్తగా పరిశీలించి తమ అర్హతకు అనుగుణంగా పథకాన్ని ఎంచుకోవాలన్నారు. ఈ పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో రూ.2.00 లక్షల లోపు ఉండాలన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21-55 సంవత్సరాలు, వ్యవసాయ సంబంధిత పథకాలకు 21-60 సంవత్సరాలు వయస్సు పరిమితిగా ఉండగా, ఒక రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఒక్కరికి మాత్రమే దరఖాస్తు చేసే అర్హత ఉంటుందని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులకు ఈ పథకం అమలులో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, వ్యవసాయ సంబంధిత పథకాల కోసం పట్టా పాసు పుస్తకం, దివ్యాంగుల కోసం సదరం, దరఖాస్తుదారుని మొబైల్ నంబర్ వంటి అవసరమైన ధృవపత్రాలు ఉండాలని సూచించారు. స్వయం ఉపాధికి ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. యూనిట్ ధర రూ.50,000/- లోపు ఉంటే 100 శాతం రాయితీ, రూ.50,001 రూ.1,00,000 వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ.1,00,000 రూ.2,00,000 వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం, రూ.2,00,000 రూ.4,00,000 వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ పథకాల కోసం బ్యాంకు రుణం లేకుండా 100 శాతం రాయితీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తును ఓబిఎంఎంఎస్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన ధృవపత్రాలతో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారికి లేదా మున్సిపల్ కమిషనర్ కు సమర్పించాలన్నారు. అభ్యర్థుడు ఏవైనా సందేహాల నివృత్తి కోసం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం లేదా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ను సంప్రదించాలని సూచించారు.

# రూ.2500 ఎప్పుడిస్తారు సార్

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని అడిగిన మహిళలు



ఎమ్మెల్యే యెన్నంను ప్రశ్నిస్తున్న మహిళలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు చెప్పిన మహిళలకు నెలకు రూ. 2,500 ఎప్పుడు ఇస్తారు అంటూ మహిళలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ప్రశ్నించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రూరల్ తాసిల్దార్ కార్యాలయం శివారులో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న మహిళా మేస్త్రి శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన 41 మంది మహిళలు మేస్త్రి తనకి సంబంధించి శిక్షణ పొందుతున్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అకస్మాత్తుగా శిక్షణ పొందుతున్న మహిళలను కలిసి వారితో మాట్లాడారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను తామే నిర్మిస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లోనూ మండల కేంద్రాల్లో సిమెంట్ ఇటుక తయారీ మెషిన్లను సబ్సిడీ కింద మహిళలకు అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. గ్యారంటీలు అమలు చేశాకే ఓట్లు అడుగుతాం మహిళలకు అందించే నెలకు రూ. 2500 పథకాన్ని ఎప్పుడు ఇస్తారని శిక్షణ పొందుతున్న మహిళలు ప్రశ్నించగా ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా పథకాలన్నీ అమలు చేసి తీరుతామని, అన్ని గ్యారెంటీలు అమలు చేశాకే మళ్ళీ ఓట్లు అడుగుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తమకు పథకాలు అమలు చేస్తే మళ్లీ మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపిస్తాం సార్ అంటూ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. మహిళలకు మేస్త్రి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే మహిళా శక్తి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఆయన వెంట గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మీడియా కన్వీనర్ సిజే బెనహర్, నాయకులు డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి తదితరులు ఉన్నారు.

# అత్యాధునిక టెక్నాలజీతో ప్రభుత్వ పాఠశాలలో ఎఐ బోధన



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**బాలానగర్, మార్చ్ 28 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విద్యార్థులతో కలిసి ఎఐ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అత్యాధునిక టెక్నాలజీతో విద్యను అందించడానికి కృషి చేస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలో ఉండే అన్ని రకాల సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలోనే పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ నాయక్, హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని ప్రతి గడపకు వివరించాలి

### జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



గ్రామాల అధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. జై బాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమాన్ని పురస్కరించు కుని గురువారం మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎఐసిసి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని, ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని ఆయన సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి వివరించాలని, ముఖ్య నాయకులు గ్రామంలో అందరిని కలుపుకొని ముందుకు పోవాలని ఆయన చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాఠశాలను నిర్వీర్యం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇలాంటి విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని ఆయన సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ మనదని, అలాంటి పార్టీలో మనందరం సభ్యులుగా ఉన్నామని అది మన అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ అందరినీ కలుపుకొని ప్రజల అభీష్టం మేరకు పనిచేసి, ప్రజల మనసును గెలవాలని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కానీ సమస్యలు కానీ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ప్రతి నెల రెండు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఆయన కండువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బెక్కెరి మధు సూదన్ రెడ్డి, సిజె బెనహర్, ఏర్పుల నాగరాజు, అజ్మత్ అలి, ఐఎన్టీయుసి రాములు యాదవ్, గోవింద్ యాదవ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, తులసిరాం నాయక్, మాధవరెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, ప్రశాంత్, ఫయాం, మన్యంకొండ నరేందర్‌రెడ్డి, పోతన్ పల్లి మోహన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, కిరణ్, ప్రసాద్ ముదిరాజ్, రాంపూర్ గోపాల్, భరత్ కుమార్ రెడ్డి, బాలయ్య, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా నిధికి లక్ష రూపాయల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ విద్యా నిధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన నెల జీతం నుంచి ఒక లక్ష రూపాయల చెక్కును శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ విద్యా నిధిని జనవరిలో ప్రారంభించామని, ఆ సందర్భంగా విద్యా నిధికి ప్రతి నెలా తనకు వచ్చే జీతం నుంచి లక్ష రూపాయలు విరాళం ఇస్తానని ఆరోజు ప్రకటించానని విద్యానిధి ఏర్పాటు చేసిన సందర్భంగా లక్ష రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేశామని, ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు తన నెల జీతం నుంచి ఒక లక్ష రూపాయల చెక్కును మహబూబ్ నగర్ విద్యా నిధికి జిల్లా కలెక్టర్‌ను కలిసి అందజేసినట్లు ఆయన చెప్పారు. విద్యానిధి అనేది మన మహబూబ్ నగర్ పిల్లల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వం విద్యాసంస్థల్లో చదివే పిల్లలకు ఈ మహబూబ్‌నగర్ విద్యానిధి చాలా ఉపయోగపడుతుందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్తలు, విద్యావంతులు, ఉద్యోగులు విద్యా నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్
- ముఖ్యమంత్రికి మాజీ సర్పంచులు పోస్టు కార్డు ద్వారా వినతి




పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రికి లేఖలు పంపిస్తున్న ప్రనీల్ చందర్, మాజీ సర్పంచులు

**జడ్చర్ల, మార్చి 28 ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, దేశంలోనే తెలంగాణ పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దితే ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా 16 నెలలుగా సర్పంచులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ అన్నారు. శుక్రవారం రాష్ట్రస్థాయి పోస్టు కార్డు ఉద్యమాన్ని మహబూబ్నగర్ జిల్లా, జడ్చర్ల మండల కేంద్రంలో పోస్టాఫీసు దగ్గర సర్పంచులతో కలిసి ముఖ్యమంత్రికి పెండిగ్ బిల్లులు చెల్లించాలని పోస్టు కార్డులు పంపారు. అనేక నిరసనలు, ఉద్యమాలు చేసినా ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, సర్పంచులను పట్టించుకోక ఆర్థికంగా కుదేలు చేసిందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సర్పంచుల పెండింగు బిల్లులు చెల్లించాలని సర్పంచుల పోస్టుకార్డు ఉద్యమానికి రాష్ట్ర కార్యవర్గం శ్రీకారం చుట్టిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. శాంతి యుతంగా చేస్తున్న నిరసన కార్యక్రమాలను పోలీసు వారిచే అణిచివేయడం తగదని అన్నారు. అక్రమ అరెస్టులకు నిరసనగా పోస్టు కార్డు ద్వారా సర్పంచుల గోస ముఖ్యమంత్రి గారికి తెలియజేయడమే లక్ష్యంగా సర్పంచులందరూ పాల్గొన్నట్లు తెలిపారు. అందాల పోటీల కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్న ఈ ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు ఎందుకు విడుదల చేయడం లేదని అడిగారు. హంగులు, ఆర్భాటాలకు, ప్రకటనల ద్వారా ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని, ఆదర్శవంతంగా గ్రామాలను తీర్చిదిద్దిన సర్పంచులను అరెస్టు చేస్తున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి తెలంగాణ సర్పంచుల పెండింగు బిల్లులు వెంటనే విడుదల చేయలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేసి రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మండల సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మండల కార్యదర్శి రవీందర్ రెడ్డి, షంషీర్, ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పండగ పూట ఆ ఇంట తీవ్ర విషాదం

### కారు బోల్తా పడి తండ్రి మృతి , గాయాలతో బయటపడ్డ తల్లి, పిల్లలు





ప్రమాదంలో నుజ్జునుజైన కారు (ఇన్‌సెట్లో) మృతి చెందిన నజీర్ (ఫైల్)

**బిజినపల్లి, మార్చి 28 ప్రభాతవార్త:** పండగ వేళ కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుదామనుకున్న ఆ కుటుంబంలో ఊహించని ప్రమాదం చోటు చేసుకుంది. వారి కుటుంబీకులను కన్నీటి సంద్రంలో ముంచేసింది. హైదరాబాద్ నగరం సికింద్రాబాద్‌కు చెందిన నజీర్ (42) కుటుంబ సభ్యులతో అత్తగారి ఊరైన నాగర్ కర్నూల్‌కు సొంత కారులో బయలుదేరాడు. పాలెం గ్రామ సమీపంలోని ఈద్గా సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ప్రమాదంలో నజీర్ తీవ్ర గాయాల పాలై మృతిచెందాడు. మృతుడు నజీర్‌తో పాటు ప్రయాణిస్తున్న అతని భార్య షబీనా బేగం, కుమారుడు సుభాన్, కూతురు ఆఫ్రా గాయాల పాలు కావడంతో 108 అంబులెన్స్‌లో నాగర్ కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎం.జి సైకిల్ దుకాణందారు ఎండిగౌస్ ఇటీవలే ప్రమాదంలో అనారోగ్యం పాలు కావడంతో తన కూతురు రంజాన్ పండగ వేళ తండ్రితో పాటు గడుపుదాం అనుకుంటే, ఊహించని ప్రమాదంలో భర్త చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకు న్నాయి. రోడ్డు ప్రమాద సంఘటనపై కుటుంబీ కుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కె. శ్రీనివాస్ తెలిపారు.

# ఎస్సీ,ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మార్చి 28 ప్రభాత వార్త:** ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో డిఎస్పి నల్లపు లింగయ్య 2023లో 31, 2024 లో 34, 2025 లో ఇప్పటిదాకా 7 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు అయ్యాయని, వాటిలో 13 కేసులకుగాను 3కేసులు చార్జిషీట్‌కు రెడీగా ఉన్నాయని, 4కేసులు విచారణ దశలో ఉన్నాయనీ, మరో 6 కేసులకు సంబంధించి డాక్యుమెంట్స్ రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం అందించడంలో బడ్జెట్ కారణంగా ఆలస్యం జరుగుతుందని సి సెక్షన్ అధికారిని అఖిల ప్రసన్న జిల్లా కలెక్టర్‌కి తెలిపారు. బడ్జెట్ వచ్చిన వెంటనే రెండు వారాలకోసారి నష్టపరిహారం చెల్లించే విధంగా చూస్తామని ఆమె చెప్పారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కిష్యా నాయక్ జిల్లా కేంద్రంలో సేవాలాల్ భవన నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించినా నేటికీ

- మిగతా3లో..

# పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

**నవాబుపేట, మార్చి28 ప్రభాతవార్త:** నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను మహబూబ్‌నగర్ జిల్లా డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం ఎస్సై విక్రమ్‌ను కేసుల విచారణ ఫీడ్‌బ్యాక్ అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలు డ్రంక్ అండ్ డ్రైవ్ సైబర్ క్రైమ్ మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ విక్రమ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసుల పరిశీలన ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఇబ్బంది కలగకుండా పోలీసులు ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# నిర్విరామంగా రెస్క్యూ..

### కొనసాగుతున్న సహాయక చర్యలు

### ఎస్ఎల్ బిసి టన్నెల్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి, ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి శుక్రవారం ఎస్ఎల్‌బిసి, టన్నెల్ లోపల సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి, టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్న సహాయక బృందాల సహాయక చర్యలపై అభినందిస్తూ, రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని, అధికారులకు సూచించారు. జిఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుండి 30 మీటర్ల వరకు భారీ కేడింగ్ చేసినట్లు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు టెలిటెల్, బాక్స్ క్రీప్ స్ట్రక్చర్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యలలో భాగంగా సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు, తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ, ఎప్పటికప్పుడు ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజన్ బయటకు తీసేందుకు, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో ఉన్న పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ ద్వారా కట్ చేస్తూ వాటి భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకువస్తున్నట్లు తెలియజేశారు. తవ్వకాల ద్వారా తీస్తున్న మట్టిని కన్వేయర్ బెల్ట్ గుండా బయటకు తరలిస్తున్నట్లు, ప్రమాద ప్రదేశ సమీపం వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలియ జేశారు. ఈ సమీక్షా సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, జిఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






సహాయక చర్యల్లో సిబ్బంది

# స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** ఇందిరా మహిళా శక్తి కార్యక్ర మంలో భాగంగా మెప్మా మహిళా సంఘాల సభ్యులచే కేఫ్ టేరియా ఏర్పాటుకు శుక్ర వారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ సర్కిల్‌లో ఆర్అండ్‌బి గెస్ట్ హౌ స్ దగ్గర స్టల పరిశీలన జరిపారు. అదే వి ధంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు ప్రభుత్వ జన రల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వెటర్న రీ హాస్పిటల్ ఆవరణలో స్టల పరిశీలన చేశా రు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కష్టాలు పడుతున్న కర్షకులు

### పల్లె బాటలో ఎండిన వరి పంటను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకుడు హన్మంత్ నాయుడు

**గద్వాల, మార్చి 28 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ నాయకుడు హన్మంత్ నాయుడు శుక్రవారం రైతులతో కలిసి నీరందక ఎండిన పంట పొలాలను పరిశీలించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే గద్వాల నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు నష్టపోతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు, బాసు హనుమంతు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గద్వాల మండలం కొత్తపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పంట పొలాలను బైక్ పై వెళ్ళి, పార్టీ నాయకులు, రైతులతో కలిసి, పరిశీలించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడుతో రైతులు తమ బాధను చెప్పుకొచ్చారు. వరి పొలానికి అప్పు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టామని, నీళ్ళు లేక పంట మొత్తం ఎండిపోయిందని బోరున విలపించారు. పంటలు ఎండిపోవడంతో తమ కుటుంబాలు అప్పుల్లో కోరుకుపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వంలో మండుటెండల్లో సాగునీటి కాలువలు జలాలతో కళకళలాడాయని, నేడు అవే కాలువలు నీళ్ల లేక వెలవెలబోతున్నయని బాసు



ఎండిన వరి పొలాలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు, హాన్మంత్ నాయుడు

హనుమంతు నాయుడు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలువలు ఎడారిగా మారాయని, నీరు లేకనే నియోజకవర్గంలో పొలాలు ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రోజు పంటలు ఎండిపోయిన సందర్భాలు లేవని అన్నారు. ప్రభుత్వానికి పాలనపై అవగాహన లేక ప్రాజెక్టుల ద్వారా నీళ్లు అందించలేకపోతుందని మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ ,ఎస్ ఈ స్పందించి, కాలువలకు నీరు వచ్చే విధంగా కృషిచేసి, మిగతా పంటను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోనేష్, డి.శేఖర్ నాయుడు,వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, తిరుమలేష్, బి. వెంకటేశ్వర్ రెడ్డి, ముని మోర్య, చిన్న, టీ వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, నరసింహులు, కె.ఈశ్వరన్న, బెల్లం రమణ,ఆంజనేయులు, అనిల్, హనుమన్న, మహిళా రైతులు, చేన్నమ్మ, రాములమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు రానీయొద్దు

### పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి పదో తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్ హైస్కూల్, క్రీస్తుజ్యోతి హైస్కూల్ వంటి పరీక్షా కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎస్పీ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే, పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా హాల్‌లో క్రమశిక్షణ పాటిస్తూ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పరీక్షా హాల్‌లోకి మొబైల్ ఫోన్లు తీసుకురావొద్దని స్పష్టం చేశారు.



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

## యూనియన్ బ్యాంక్ ఏర్పాటు

## చేయడం అభినందనీయం : కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసీ)లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను శుక్రవారం కలెక్టర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్య నారాయణతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ బ్యాంక్ ద్వారా ప్రతి రోజు నగదు, డిజిటల్ లావాదేవీలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు వినియోగించుకోవాలని తెలిపారు. బ్యాంక్ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో భాను ప్రకాష్, డిపిఆర్ఓ సీతారాం, ఎల్‌డిఎం కౌశల్ కిషోర్ పాండే, ఏఎల్‌డిఎం సాయి, బ్రాంచ్ మేనేజర్ సతీష్, ఇతర బ్యాంక్ అధికారులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, మార్చి 28 ప్రభాతవార్త :** మండలంలోని లత్తిపూర్ మాజీ ఉప సర్పంచ్ రవి శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శుక్రవారం బాధితున్ని పరామర్శించారు. అదేవిధంగా వెల్టూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు చింతోజు వెంకటేష్ సోదరుడు సాయిబాబు తనయుడు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో బాధిత కుటుంబాలను అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. అంతకుముందు లత్తిపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కట్టమైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. లత్తి పూర్, వెల్టూర్ గ్రామాలలో బాధితులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తోపాటు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బాలు నాయక్, లత్తి పూర్ మాజీ సర్పంచ్ మల్లేష్, చింతోజు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలపై అవగాహన

**శ్రీరంగాపూర్ మార్చి 28 ప్రభాతవార్త :** టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులందరూ వచ్చే విద్యా సంవత్సరం శ్రీరంగాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని శుక్రవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో టెన్త్ క్లాస్ పరీక్ష అయిపోయిన తర్వాత విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామర్స్ లెక్చరర్ జే. కురుమూర్తి, సీనియర్ అసిస్టెంట్ వి. వెంకటన్న విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ ఎస్ బాలుర, బాలికలు కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్ నాగసానిపల్లి, జడ్పీహెచ్ఎస్ అయ్యవారిపల్లి మొత్తం 156 మంది విద్యార్థిని విద్యార్థులకు శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న ప్రతి విద్యార్థికి తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ప్రతి విద్యార్థికి పదివేల రూపాయల స్కాలర్‌షిప్, ఉచిత అడ్మిషన్, ఉచిత విద్యాబోధన అందించడం జరుగుతుందని, ఇక్కడ సైన్స్ ల్యాబ్లు, సొంత భవనం, మంచి ఫర్నిచర్ అదేవిధంగా 25 సంవత్సరాల అనుభవం కలిగిన లెక్చరర్లచే ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియంలో విద్యాబోధన అన్ని సౌకర్యాలతో ఇంటర్మీడియట్ విద్య బోధన అందించబడుతుందని విద్యార్థులకు చెప్పడం జరిగింది.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## బండలయ్య ఉరుసులో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

**ఆత్మకూరు, మార్చి 28 ప్రభాతవార్త :** ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని గోపన్నపేట గ్రామంలో జరుగుతున్న బండలయ్య ఉరుసు ఉత్సవాలలో మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యుడు వాకిటి శ్రీహరి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సోదరులకు అన్ని రకాలుగా అండదండగా ఉంటుందని పార్టీలకతీతంగా జరగనున్న ఉత్సవాలకు ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ చర్యలు చేపట్టేందుకు తాను ఎల్లవేళలా ముందు ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలోని బండలయ్య వత్సవాలలో ప్రతి సంవత్సరం మాదిరిగా గ్రామానికి చెందిన బషీర్ణతంలో జరుగుతున్న వరుస ఉత్సవాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ప్రజల సుఖసంతోషాలతో జీవించాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరాజు యాదవ్, పరమేష్ ,రహమతుల్లా,శ్రీనివాసులు ,గంగాధర్ గౌడ్ ,గ్రామానికి చెందిన నాయకులు వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ముస్లిం సోదరుల నిరసన

**ఆత్మకూరు, మార్చి 28 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని జమా మసీదులో ముస్లిం సోదరులు శుక్రవారం నమాజ్ అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి వక్ బోర్డు బిల్లును నిరసిస్తూ చేతికి నల్ల వస్త్రాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా మైనార్టీ సోదరుల పట్ల వివక్ష ప్రదర్శించడమే కాకుండా ఒక బోర్డు బిల్లును పార్లమెంటులో, రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తుందని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు రక్షణగా నిలిచి ఒక బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ముస్లిం సోదరులతో పాటుగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మైనార్టీ సోదరులు నిరసన వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**బాలానగర్, మార్చి 28 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా చూడాలని, కాంగ్రెస్ పార్టీ పాత క్యాడర్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యకర్తలను విస్మరిస్తే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వచ్చేనెల మొదటి వారంలో మండలంలో హేమాజీపూర్ గ్రామం నుండి పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. పాదయాత్ర కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు తిరుపతి, హరి సింగ్, వెంకటరెడ్డి, దత్తాత్రేయ, నందీశ్వర్, పొట్లపల్లి యాదయ్య, బద్రునాయక్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై ఆమోదం

**ఉప్పునుంతల, మార్చి 28 ప్రభాతవార్త :** వచ్చే ఆర్థిక సంవత్సరం 2025,26 గాను అంచనా బడ్జెట్ పై జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం (మహా జనసభ) జరిగింది.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఈ ఆర్థిక సంవత్సరం పంట రుణాల కోసం రైతులకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు నాలుగు కోట్ల వరకు ఇవ్వాలని అంచనా బడ్జెట్ పై సభ్యులు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పాల ఉత్పత్తి కోసం ఐదు కోట్లు, కోళ్ల పెంపకం సభ్యులకు రెండు కోట్లు, గొర్ల పెంపకం కోసం ఐదు కోట్లు, కర్షక మిత్ర, భూ అభివృద్ధి కోసం పది కోట్ల వరకు రుణాలు ఇచ్చేందుకు సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ తీర్మాణాన్ని ఉన్నతాధికారులకు సమర్పించినట్లు విండో చైర్మన్ పేర్కొన్నారు. అంతకుముందు సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు ఇప్పటివరకు పంట రుణాలపై, దీర్ఘకాలిక, బంగారు ఆభరణాలపై, కిరాణం రుణాలపై వచ్చిన వడ్డీ ఫిక్స్ డిపాజిట్, వ్యాపారంపై వచ్చిన ఆదాయం తదితర అంశాలపై నివేదిక సభ్యుల ముందు చదివి వినిపించారు. బ్యాంకు లావాదేవీలను వివరించారు.ఈ సమావేశంలో డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్ రెడ్డి, డైరెక్టర్లు సూరం నారాయణరెడ్డి, ఆలూరు శ్రీనివాసులు, సాయిబాబులతో పాటు డైరెక్టర్లు, రైతులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం

## బాధితులను ఆదుకునేందుకు ఎల్లవేళలా ముందుంటా: ఎమ్మెల్యే

**ఆత్మకూరు, మార్చి 28 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునేందుకు తాను ఎల్లవేళలో ముందుంటానని మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యుడు వాకిటి శ్రీహరి వెల్లడించారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లంపల్లి మనవరాలు అనారోగ్య కారణంతో చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గ్రామానికి వెళ్లి బాధ్యత కుటుంబాన్ని సందర్శించి వైష్ణవి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏ కార్యకర్తకైనా సరే ఆపదలో ఉన్నానని తెలిసిన వెంటనే ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఈ విషయాన్ని సామాన్య కార్యకర్తలు సైతం తన ద్వారా సహాయ సహకారాలు పొందవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పుట్నాల రమేష్ తల్లి మరణవార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబాన్ని సందర్శించి ఓదార్చారు. మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గత వారం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం సొంత గ్రామానికి చేరుకున్న వెంటనే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబాన్ని సందర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా, కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు, వనపర్తి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మొగిలి గంగాధర్ గౌడ్ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు నాయకులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని సందర్శించి ఓదారుస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

## మక్తల్ ఎమ్మెల్యేపై ఆరోపణలు హాస్యాస్పదం

**మక్తల్,మార్చి28 ప్రభాతవార్త:** సామాన్య వ్యక్తి నుంచి ఒక సమూహ శక్తిగా ఎదిగి నేడు మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరిపై మాజీఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాగనూరు పాఠశాలలో జరిగిన ఘటనపై నిజానిజాలను ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే తనఇష్టానుసారం మాట్లాడడం సరికాదన్నారు.మూడు పర్యాయాలు మక్తల్ ఎమ్మెల్యేగా ఉన్న రామ్మోహన్ రెడ్డి ఏనాడు ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అదే మాగనూరు పాఠశాలలో గతంలో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైనప్పటికీ బాధ్యులపై ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల విద్యార్థులకు కొద్దిగా ఇబ్బంది జరిగిన అంశాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి హుటాహుటిన స్పందించి విద్యార్థులకు త్వరితగతిన చికిత్స అందేలా చూడడం జరిగిందన్నారు.అలాగే మక్తల్‌నియోజకవర్గ కేంద్రంలో 150పడకల ఆసుపత్రి,కోర్టుసముదాయం,ఫైర్‌స్టేషన్,డిగ్రీకళాశాల, నర్వలో జూనియర్ కళాశాల,మక్తల్,ఆత్మకూరుపట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.అలాగే రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కంకణ బద్ధులై ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో ప్రజలే మరోసారి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్, ఆనంద్ గౌడ్,గొల్లపల్లి నారాయణ, శివరాంరెడ్డి,ఫయాజ్,శ్రీనివాస్,వల్లంపల్లి లక్ష్మణ్,వాకిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## ఉపాధి హామీ కూలీలకు 100రోజుల పని కల్పించాలి

**శ్రీరంగాపూర్, మార్చి 28 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని నాగసానిపల్లె గ్రామంలో ఉపాధి పని చేస్తున్న ప్రదేశమును తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు పెబ్బేరు మండల కార్యదర్శి ఆర్. దేవన్న సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి పని చేస్తున్న వారితో మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అనగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు ప్రతి మనిషికి వంద రోజులు పని కల్పించాలని కొలతలతో నిమిత్తం లేకుండా రోజు కూలీ ఆరు వందల రూపాయలు ఇవ్వాలని, ఒకవేళ కొలతలని కొనసాగించాలంటే రోజు కూలి రూ. 800లు ఇవ్వాలని కోరడం జరిగింది. గతంలో మాదిరిగా పనిముట్లకు, మంచినీళ్లకు డబ్బులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడనిచ్చే టెంట్లు, వయసు మీరిన కూలీలకు పని ప్రదేశానికి గ్రామపంచాయతీ ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. బంగారు ధరలు నిరంతరము పెంచుతున్న కేంద్ర ప్రభుత్వము ఉపాధి పనులను నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం మా కూలి రేట్లు ఎందుకు పెంచదు అని కూలీలు ప్రశ్నించడం జరిగింది. అదేవిధంగా రోజువారి ఉపాధి పనిలో రూ.160 కూలి చేస్తున్న మాకు, చట్టసభల ప్రజాప్రతినిధులు, ఉన్నత ఉద్యోగులు ఒక రోజుకు వేల రూపాయలు వేతనము తీసుకుంటున్న వారికి ఒకే రకమైన బంగారు రేటు ఎందుకు ఉండాలని కూలీలు ప్రశ్నించడం జరిగింది.



మాట్లాడుతున్న వ్యకాస సంఘం నాయకులు

## పేద ప్రజలకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**గద్వాల, మార్చి 28 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మల్దకల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్దిదారులకు సీఎం సహాయ నిధికి నమోదు చేసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. రాములమ్మ కు చికిత్స నిమిత్తం 60000 రూపాయల చెక్కును నాయకి లక్ష్మ దేవి, తిమ్మారెడ్డి కు చికిత్స నిమిత్తం 60000 రూపాయల చెక్కును, కే.శే నర్సింహులు కు రామకృష్ణ చికిత్స నిమిత్తం 42000 వేలు, రాముడుకు చికిత్స నిమిత్తం 40000 వేలు, సూర్య ప్రకాష్ యాదవ్ కు 38000 వేలు, తిప్పన్న కు చికిత్స నిమిత్తం 34000 వేలు, ఉప్పు సూర్యబాబుకు చికిత్స నిమిత్తం 30000 వేలు, ఉప్పు ఏదన్న కు చికిత్స నిమిత్తం 30000 వేలు, మంజులకు చికిత్స నిమిత్తం 21000 వేలు, బీరెల్లి గోవిందమ్మ కు చికిత్స నిమిత్తం 21000 వేలు, పద్మముకు చికిత్స నిమిత్తం 20500 వేలు, సుదర్శన్ కు చికిత్స నిమిత్తం 19000 వేలు ,జయంతి కు చికిత్సనిమిత్తం 18500 కు రమపోగు ప్రేమన్న కు చికిత్స నిమిత్తం 18000 వేలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి టీసి ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ విక్రమ్ సింహ రెడ్డి, చైర్మన్ ధర్మా రెడ్డి, మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, తహశీల్దార్ మల్లికార్జున్, మాజీ ఎంపిపి ప్రతాప్ గౌడ్, ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

### నీరు అందించి పంటలను కాపాడాలని

## జిల్లెల చిన్నారెడ్డికి వినతి పత్రం



జిల్లెల చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**పెబ్బేరు, మార్చి 28 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం రాంపురం గ్రామం, ఇతర గ్రామాల రైతులు రబీ సీజన్ కు నీరు అందించి పంటలను కాపాడాలని శుక్రవారం హైదరాబాదులోని ప్రజా భవన్ వద్ద ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిలేల చిన్నారెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా డి18, డి19, వరకు ఏప్రిల్ చివరి వారం వరకు నీటిని వదలాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ సంబంధిత జూరాల ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నీరు అందిస్తామని ఎవరు అధైర్యపడవద్దని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నేడు మల్దకల్ సంత వేలం

**మల్దకల్,మార్చి 28 ప్రభాతవార్త :** నేడు గ్రామ పంచాయతీ మల్దకల్ 2025-26 సంవత్సరానికి వార సంత వేలం నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ అధికారి ఒక ప్రకటన తెలిపారు. ఆసక్తి కలిగి వేలం పాటలో పాల్గొనదలచినవారు రూ.50,000 వేలు గ్రామ పంచాయతీ మల్దకల్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ తీసి గ్రామ పంచాయతీ యందు దరఖాస్తు చేసుకోగలరు. ఈ వేలం పాట కనీస మద్దతు ధర రూ.40,6266 ఉంటుందన్నారు.

## నేడు కంసాని పల్లి సన్నాహక సమావేశం

**ఉప్పునుంతల,మార్చి28 ప్రభాతవార్త:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరామ గట్టుపై జరిగే సీతారాముల కళ్యాణం ఉత్సాహాలపై నేడు శనివారం ఉదయం 7 గం.లకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు శ్రీరామ గట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.వచ్చేనెల 6నసీతారాముల కళ్యాణం నిర్వహించేందుకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నందున సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీరామ గట్టు ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

**బాలానగర్ మార్చి 28 ప్రభాతవార్త :** ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఎస్సై లెనిన్ వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మణిదీప్ (18) హైదరాబాదులో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. ఎప్పటిలాగే గురువారం కాలేజీకి వెళ్లి తిరిగి వచ్చి రాత్రి తిని తన రూమ్‌లో పడుకున్నాడని, శుక్రవారం ఉదయం దాదాపు 6:30 సమయంలో నిద్ర లేపడానికి పిలిస్తే పలకలేదని తలుపులు బద్దలు కొట్టి చూడగా రూములో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తమ కుమారుడి ఆత్మహత్యకు ఎవరు కారకులు కారని, ఎవరిపైన అనుమానం లేదని యువకుడి తండ్రి పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మణిదీప్ (ఫైల్)

## నేడు ఆత్మకూరులో తైబజారు వేలం

**ఆత్మకూరు, మార్చి 28 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నేడు ఆత్మకూర్ తైబజార్ వేలం నిర్వహించినట్లుగా మున్సిపల్ కమిషనర్ చికిని శశిధర్ విలేకరులకు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలం నిర్వహించినట్లుగా ఆయన తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనదలచిన వారు 30 వేల రూపాయలను ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ పేరిట బ్యాంకులో డిడి చెల్లించి కార్యాలయంలో అందజేసి తైబజారు వేలంలో పాల్గొనాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో జరిగిన సదస్సులో

## పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు




**శ్రీరంగాపూర్, మార్చి 28 ప్రభాతవార్త :** ఢిల్లీలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో శ్రీరంగాపూర్ మండలానికి చెందిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రసాద్‌యాదవ్ ఈ సదస్సులో పాల్గొనడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అగ్ర నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, టిపిసిసి ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, అదేవిధంగా అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయడానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే,కేసీ వేణుగోపాల్, శిక్షకులకు దిశా, నిర్దేశం చేయడం జరిగింది. అదేవిధంగా జిల్లా అధ్యక్షుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది.

## భూత్పూర్‌లో కాంగ్రెస్ జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం

-సన్నాహక సమావేశంలో పాల్గొన్న మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కేసిరెడ్డి, లిక్కి



భూత్పూర్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**భూత్పూర్,మార్చి 28,ప్రభాతవార్త:** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన ఆధారంగా విజయవంతంగా అమలు చేస్తున్న 42శాతం బీసీ రిజర్వేషన్,ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ వంటి నిర్ణయాలను ఆచరణలో పెడుతున్న సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశం మేరకు శుక్రవారం పట్టణ,మండల కాంగ్రెస్ నాయకులు జై బాపు,జై భీం,జై సంవిధాన్ అభియాన్ పేరిట భూత్పూర్ పట్టణ కేంద్రంలో గొప్ప సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ముడావత్ హరియానాయక్,మండల ఎస్సీ సెలఅధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు,మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు,పార్టీ భూత్పూర్ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు హాజరై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు తీసుకున్న కొద్ది నెలల్లోనే ప్రతిష్టాత్మకమైన పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తున్నారన్నారు.సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీల వర్గీకరణ బిల్లును సక్సెస్ చేశారని,ఏ ప్రభుత్వం చేపట్టని కులగణనను చేపట్టి రిజర్వేషన్లలో పకడ్బందీగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారన్నారు.సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు చేపట్టని పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో భూత్పూర్ పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆగిరి రవితో పాటు నాయకులు కాంగ్రెస్ కప్పెట గ్రామ కమిటీ అధ్యక్షుడు టీవీ రెడ్డి,మొల్గర వెంకటేష్,రాంరెడ్డి,దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు పార్టీ సీనియర్ నాయకులు టి గోవర్ధన్‌గౌడ్,మంగలి వెంకటనారాయణ,సంజీవరెడ్డి,మొహిద్దీన్,తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

పనులు ప్రారంభం కాలేదని కలెక్టర్ కు దృష్టికి తీసుకువచ్చాడు. అలాగే బుడగ జంగాల సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణయ్య మాట్లాడుతూ మక్తల్ లోని 5 వ వార్డు పరిధిలో 70 మంది దాకా ఉన్న బుడగ జంగాల పిల్లల కోసం అక్కడి సమీపంలో అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి అధికారి ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఖలీల్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డా. సౌభాగ్య లక్ష్మి, డిడబ్ల్యుఓ జయ, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, గిరిజన సంక్షేమాధికారి శత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం



ఇటిక్యాల నూతన తహసీల్దారు వీరభద్రప్పను కలిసి సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, మార్చి28 ప్రభాతవార్త:** ఇటిక్యాల మండలం నూతన తహసీల్దారుగా ఇటీవల వీరభద్రప్ప గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల తహసిల్దార్ వీరభద్రప్పను మర్యాద పూర్వకంగా కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పెద్దదిన్నె మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, అశోక్ తదితరులు కలిసి పూలబొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## మట్టి తరలింపును ఆపాలని తహసీల్దార్‌కు వినతి

**రాజాపూర్, మార్చి28 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రం సమీపంలోని పొలాల నుండిరాత్రి వేళలో అక్రమంగా టిప్పర్ల ద్వారామట్టిని తరలిస్తున్నారని అక్రమ మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు తహసిల్దార్ విద్యాసాగర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ విద్యాసాగర్ రెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆదిత్య, రాచమల్ల యాదగిరి, భీమగళ్ల నర్సింలు, పల్లె రవి, బైండ్ల ప్రభాకర్, మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఉన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కారపాకులలో సిసిరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కారపాకుల గ్రామంలో ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.5 లక్షలతో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, అల్ల భకాష్, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హుస్సేన్, మాలిక్ భాష, మైనుద్దీన్, కృష్ణయ్య, చిన్న నాగన్న, మద్దిలేటి, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**ఇటిక్యాల, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో మసీదులో శుక్రవారం సాయంత్రం కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ కాంగ్రెస్ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నెల రోజులపాటు ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులు భక్తితో చేసే రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు మత పెద్ద ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు

**తెలకపల్లి,మార్చి 28 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసునమోదు చేసిన సంఘటన శుక్రవారంమండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు హెడ్ కానిస్టేబుల్ నారాయణ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నడిగడ్డ గ్రామ శివారులో గల దుందుభి వాగు నుండి ఎలాంటి ప్రభుత్వాలు అనుమతులు లేకుండా దొంగతనంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ టి.ఎస్ 32 ఎ 0200, ట్రాలీకి ఎలాంటి నెంబర్ లేదు. అట్టి ట్రాక్టర్‌ను ఉదయం అందాజు 06:00 గంటలకు తాళ్లపల్లి గ్రామ సమీపంలో పట్టుకొని డ్రైవర్ నడిగడ్డ గ్రామానికి చెందిన కనకల జంగయ్య తండ్రి శ్రీశైలం అని తెలువగా ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి బ్లూకోల్ట్ పిసి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నిబద్ధత కలిగిన జర్నలిస్టులకు ఐజేయు అండ

# అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ అందేలా కృషి చేస్తాం

- ◆యూనియన్ ఏ పార్టీకి అనుబంధం కాదు.. ఏ పార్టీకి వ్యతిరేకం కాదు
- ◆జర్నలిస్టు ముసుగులో బ్లాక్ మెయిల్ చేస్తే సహించేది లేదు
- ◆టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్

**వనపర్తి ప్రతినిధి, మార్చి28 ప్రభాతవార్త :** నిజాయితీ, నిబద్ధత కలిగిన జర్నలిస్టులకు ఐజేయు ఎల్లవేళలా అండగా ఉంటుందని, టియుడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు)జర్నలిస్టు యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మన్యం, అరుణ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో ఉంటూ నిజమైన వార్త కథనాలను రాస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటున్న వారందరికీ యూనియన్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. అక్రిడిటేషన్ కార్డులను కొన్ని శక్తులు అంగట్లో సరుకుగా మార్చాయని, జర్నలిజం పరువు ప్రతిష్టలను దిగజార్చుతున్న అలాంటి శక్తులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో వెలువడిన అక్రిడిటేషన్ జీవో అప్రాజస్వామికంగా ఉందని కొందరు కోర్టును ఆశ్రయించడం వల్ల అక్రిడిటేషన్ కార్డులజారీ ప్రక్రియ ఆలస్యమవుతుందన్నారు. అర్హులైన జర్నలిస్టుల అందరికీ కచ్చితంగా అక్రిడిటేషన్ కార్డులు అందించేలా కృషి చేస్తామని. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో సీనియర్ పాత్రికేయులతో కూడిన కమిటీ సమావేశమై కొత్త నియమ నిబంధనలు రూపొందించి ప్రభుత్వం ముందు ఉంచడం జరిగిందన్నారు. ఈ నిబంధనలకు అనుగుణంగా ఫీల్డ్ వర్క్ చేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు తప్పకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించేం దుకు యూనియన్ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫైనాన్స్ మినిస్టర్, అదేవిధంగా హెల్త్ మినిస్టర్‌లను కలిసి జర్నలిస్టులకు హెల్త్ కార్డులు (జెహెచ్‌ఎస్) మంజూరు చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించిన విషయాన్ని మధుగౌడ్ గుర్తు చేశారు. అంతేకాకుండా జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించిన ఘనత కూడా వనపర్తి జిల్లాకే దక్కిందన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కుటుంబాల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం కావడమే కాకుండా ఇతర జిల్లాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఐజేయు యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, అలాగే వ్యతిరేకం కూడా కాదన్నారు. నిజాలను నిర్భయంగా వార్త కథనాలు రాయడం తప్పు కాదు కానీ, వార్తలను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో మండలాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకున్నా మని,తాజాగా జిల్లా కేంద్రంలోఏర్పాటు చేసిన సభ్యత్వ కార్యక్ర మానికి భారీ సంఖ్యలో జర్నలిస్టులు హాజరు కావ డం యూని యన్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత చాటి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా ఏర్పాటు చేసిన నిర్వాహకులు లక్ష్మణ్, మన్యం,అరుణ్ రాజ్‌కుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.మాధవరావు,సీనియర్ పాత్రికేయులు మల్యాల బాలస్వామి, పోలిశెట్టి బాలకృష్ణ, ఉషన్న, పొర్లాఒడ్డి, శ్రీనివాసరావు, కొంతం ప్రశాంత్, రాజు, భాస్కర్, దినేష్, విజయ్, యాదిరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శివ,అంజి, నరసింహ రాజు,అరుణ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు

## సకాలంలో రైతులకు ఎరువులు,విత్తనాలు

■ పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మికాంత్‌రెడ్డి



మహాజన సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి

**ఆత్మకూరు, మార్చి 28 ప్రభాతవార్త:** రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు విత్తనాలను సకాలంలో అందజేసేందుకు అన్ని రకాలచర్యలు తీసుకుంటామని రేచింతలపిఎసిఎస్ చైర్మన్ లక్ష్మికాంత్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం, చింతల పిఎసిఎస్ కార్యాలయ పరిధిలోని ఐదు గ్రామాల రైతులకు సంబంధించి మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఐదు గ్రామాల పరిధిలోని రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటుగా రైతులకు ప్రభుత్వం ప్రకటించినటువంటి 500 రూపాయల బోనస్ చెల్లించేందుకు తమ కార్యాలయం నుండి అన్ని రకాల చర్యలు చేపట్టినట్లుగా ఆయన వెల్లడించారు. రేచింతల సింగిల్ విండో కార్యాలయ పరిధిలో గల 1329 మంది రైతులకు ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టేందుకు తమ సిద్ధంగా ఉన్నామని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు పీఏసీఎస్ అధికారులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా రైతులు దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలను తీసుకున్న వారు సకాలంలో చెల్లించి సీఈఓ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మార్చి 28 ప్రభాతవార్త :** వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని లేనియెడల చట్టపకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏ ఎస్సై ఆంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలని చాలావరకు నివారించవచ్చని సూచించారు. వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనదారులు రాష్ డ్రైవింగ్ చేయరాదని మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు అని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడిపితే చాలావరకు రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమనస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబంది, వాహనదారులు పాల్గొన్నారు.

## మద్దిగట్ల రోడ్డుకు మోక్షం

**భూత్పూర్,మార్చి 28,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది.మద్దిగట్ల స్టేజి ఆర్‌అండ్‌బి రోడ్ నుంచి మద్దిగట్ల మీదుగా ఎల్కిచర్ల వరకు గల ఆరు కిలోమీటర్ల రొడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకున్నారు.శుక్రవారం పంచాయతీరాజ్ డివిజనల్ ఎక్సిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ)లక్ష్మణ్‌గౌడ్,ఏఈ స్వామిలతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రొడ్డు పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి ఇతర నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,రాంరెడ్డి, వెంకటేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## పాముకాటుతో గిరిజన మహిళ మృతి

**పానుగల్, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన గమిలి(59) మంగళవారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నెమలి సోమవారం ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి వచ్చి వంట చెరుకు తీసుకురావడం కోసం వెళ్లగా పాము కాటు వేసిందని బాధితురాలు తెలపడంతో సమీపంలో ఉన్నవారు పరిస్థితి అధిగమించడంతో కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాముకాటుతో మృతిచెందినగమిలి ఒంటరిగా జీవిస్తుందని కుటుంబ సభ్యులుబ్రతుకు తెరువు నిమిత్తంవలస వెళ్లారని కాగా ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**నారాయణపేట టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:** కుక్కల కారణంగా మూడవ వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతూ శుక్రవారం నారాయణపేట పట్టణంలోని మూడవ వార్డు ప్రజలు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలోని మూడవవార్డు శాసన్‌పల్లి రోడ్డు గోవిందుగేరి లక్ష్మికాంత్ ఇంటి పక్కన ఓ వ్యక్తి కుక్కలను పెంచుకోవడం జరిగింది. కుక్కల కారణంగాఅరుపులు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నామని కమిషనర్ ముందు వాపోయారు. కుక్కల విషయాన్ని యజమానికి పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు.స్పందించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో తిరుపతయ్య,వెంకట్ రామ్‌రెడ్డి, రఘు, వార్డు ప్రజలు ఉన్నారు.

## అమిస్తాపూర్ జామియా మజీద్ అభివృద్ధికి ఆర్థిక సహాయం

-ఆర్థిక సహాయం అందించిన బీజేపీ నాయకుడు కెంద్యాల శ్రీనివాస్



రూ.50వేల చెక్కును అందజేస్తున్న బీజేపీ నేత కెంద్యాల శ్రీనివాస్

**భూత్పూర్,మార్చి 28,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లోని జామియా మజీద్ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రు.50వేల ఆర్థిక సహాయాన్ని బీజేపీ నాయకుడు కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను) అందించారు. ముస్లింల పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల కోరిక మేరకు మజీద్ డెవలప్‌మెంట్ కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కెంద్యాల పేర్కొన్నారు.ఆర్థిక సహాయాన్ని శ్రీనివాస్ చెక్కు రూపంలో ముస్లిం కమిటీ మత పెద్దలకు అందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండి ఫారూక్‌హుస్సేన్,బీజేపి సీనియర్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి ,శ్రీధర్,యాదగిరి,ముత్యాల నర్సింములు,శంకర్,నర్సింహులు ఇతర ముస్లిం నాయకులు,మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌గా ఎంపికైన యువకుడిని అభినందించిన బీజేపీ నాయకులు

**కృష్ణ, మార్చి 28 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని ఉపయోగించుకుని కృష్ణ మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రమేష్ అగ్నివీర్‌గా ఎంపిక అయిన సందర్భంగా ఆ యువకుడ్ని బిజెపి నాయకులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఖాన్‌దొడ్డి గ్రామస్తులు ఆ గ్రామనాయకులు ఆర్మీ జవాన్‌కు ఆయన తల్లిదండ్రులు ఎర్ర తాయప్ప నర్సమ్మను ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మా గ్రామం నుండి ఆర్మీలో మొదటి అగ్నివీర్‌గా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని యువకులు కూడా రమేష్‌ను ఆదర్శంగా తీసుకుని ఇంకా మంచి చదువులు చదవాలని కన్న తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురులందరికీ మీ గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని గ్రామస్తులు పేర్కొన్నారు.ఆర్మీ జవాన్‌కు సత్కరించిన కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్‌గౌడ్, సీనియర్లు, చంద్రశేఖర్,కృష్ణయ్య, జి. శ్రీనివాసులు,కుర్వ బాలరాజు, రాజు, ఆంజనేయులు, తాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



యువకుడిని సన్మానించిన బిజెపి నాయకులు

## పశువుల సంత టెండర్‌ను రద్దు చేయాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు

**తెలకపల్లి, మార్చి28 ప్రభాతవార్త:** పశువుల సంత టెండర్‌ను రద్దు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించినట్లు మాజీ ఉపసర్పంచి కొత్తపల్లి సుందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆర్. కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం మండల కేంద్రంలో నిర్వహించినటువంటి పశువుల సంత వేలంపాటను కొంతమంది రింగుగా ఏర్పాటై వారి సొంత స్వలాభం కోసం షీల్డ్ కవర్ పద్ధతి ద్వారా టెండర్‌ను తీయడమేంటని ఆరోపించారు. గత సంవత్సరాని కంటే రూ. 21 లక్షల వేలాన్ని తక్కువకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. గ్రామ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో రీటెండర్ నిర్వహించకపోతే దీనిపైన ఎంతవరకైనా వెళ్తామని అవసరమైతే నిరసన ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పశువుల సంత టెండర్ మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఆటంకం కలుగుతుదని ప్రజలు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భారీగారి రమేష్, బొమ్మసాని శివ భాషమోని మల్లేష్, సత్యనారాయణ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్సై

**లింగాల, మార్చి28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాగ్దూంపూర్ ఎక్స్ రోడ్డులో ఎస్సై నాగరాజు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడిపిస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనాలపై పెండింగ్ లో ఉన్న చలాన్లను ఆన్ లైన్‌లో చల్లాన్లు చల్లించాలని వాహనదారులను కోరారు. వావానదారులు మద్యం సేవించి వాహనాలు నడిపిచో అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బస్సులోంచి దింపి యువకుడిపై దాడి

**నవాబుపేట,మార్చి28 ప్రభాతవార్త:** కలిసి ఒకే చోట పనిచేస్తున్న ఇద్దరు యువకుల మధ్యలో మనస్పర్ధలు రావడంతో పెద్ద గొడవకు దారితీసి నవాబుపేట బస్సులో ప్రయాణిస్తున్న తోటి యువకుడిని బస్సులో నుంచి దింపి పిడుగులతో రక్తం కారేలా గాయపరిచిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రామావత్ వినోద్ సోహెల్, యువకులు ఇద్దరూ ఒకేచోట మహబూబ్‌నగర్‌లో గల పెట్రోల్ బంకులో పనిచేస్తున్నారు. ఇద్దరి మధ్య చిన్న మనస్పర్ధలు పెద్దగొడవకు దారితీసి బూతులతో ఇరువురు తిట్టుకున్నారు.ఇది మనసులో పెట్టుకుని శుక్రవారం బస్సులో పెట్రోల్ బంకు పనికి వెళుతున్న రమావత్ వినోద్ పై సోహెల్ మార్గమధ్యంలో వెళుతున్న బస్సులోనుండి బస్సును ఆపి వినోద్ నుదింపి ముఖంపై పిడుగులతో గాయపరచగా వినోద్ ను మహబూబ్‌నగర్‌ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేశారు.

## వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

**తెలకపల్లి, మార్చి28 ప్రభాతవార్త:** ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం స్థానిక పోలీసులు ఎస్‌హెచ్‌ఓ పరిశరాములు అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బొపల్లి గ్రామానికి చెందిన అల్వాల రామస్వామి తండ్రి లేట్ చంద్రయ్య (43) వృత్తి వ్యవసాయం గత కొద్దికాలం నుంచి బాగా త్రాగుడుకు బానిసై ఇంట్లో పిల్లల్ని, సంసారాన్ని పట్టించుకోకుండా ఉంటే ఇలా అని ఎన్నోసార్లు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడే సర్ధి చెప్పినా తన ప్రవర్తన మార్చుకోకుండా అలాగే తాగుతూ తిరుగుతుండగా అందుకు అతని భార్య ఈనెల 24 రోజున రాత్రి 10గంటలకు ప్రతిరోజు మద్యం తాగి తిరిగితే సంసారం ఎలా గడుస్తుందని అడగగా ఆమెతో గొడవ పెట్టుకొని ఆ మరుసటి (మంగళవారం) రోజు తెల్లవారుజామున అందాజ 4:00 గంటలకుఇంట్లో కనిపించకుండా పోయాడని చుట్టుపక్కల, బంధువుల వద్ద స్నేహితుల వద్ద విచారించిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. అతని ఎత్తు 4.5 చామన చాయ రంగు కలిగి ఉన్నాడని, అతని భార్య అల్వాల నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నేడు మైరావణ పద్య నాటకము

**మిడ్జిల్, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం మైరావణ పద్యనాటకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నవజ్యోతి కళామండలి సభ్యులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో మీనాంబరం నవజ్యోతి కళామండలి ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి తొమ్మిది గంటలకు పద్య నాటకంతో పాటు శ్రీకృష్ణ రాయబారంలోని శయన దృశ్యము, సత్య హరిశ్చంద్రంలోని వారణాసి ఘట్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు ప్రజలందరూ పాల్గొని నాటకాన్ని వీక్షించాలని కోరారు.

### రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

**కృష్ణ, మార్చి 28 ప్రభాతవార్త:** మండల యువతి యువకులకు రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయనమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా అన్ని కులాల వారికి స్వయంఉపాధి కల్పించేందుకు 4లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కావున అర్హత ఉన్న వాళ్ళందరూ ఏప్రిల్ 5లోపు ఆన్లైన్ సెంటర్లో అప్లికేషన్ చేసుకోవాలని దీని ద్వారా మండలయువకులు ఆర్థికంగాఅభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి

**జడ్చర్ల, మార్చి 28 ప్రభాత వార్త:** జడ్చర్ల నియోజక వర్గం చంద్ర గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిదిగా పాల్గొన్న పిసిసి ఉపాధ్యక్షులు టిజిఎంఎఫ్‌సి ఛైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి, సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉప వాస దీక్ష ను విడిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ నాయకులు, ముస్లిం సోదరులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పది పరీక్షలు రాయాలి

● నాగర్‌కర్నూల్ డీఈఓ ఏ.రమేష్‌కుమార్



పరీక్షల తీరును పరిశీలిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మార్చి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పదీ పరీక్షలు రాయాలని డీఈఓ ఏ.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. వంగూరు, చారకొండ మండలాల్లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం డీఈఓ ఏ.రమేష్ కుమార్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు,విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈనెల 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని 60 పరీక్ష కేంద్రాలలో 10,584 మంది విద్యార్థులకు గాను 10,556 మంది విద్యార్థులు హాజరయ్యారు. 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు చారకొండ పోలీస్ స్టేషన్ నుంచి జిల్లాలోని 60 పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్మెంట్ అధికారులతో నేటి పరీక్షల నిర్వహణపై సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.చీఫ్ సూపరింటెండెంట్లు తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల్లోని రూములను సందర్శించి సిబ్బందికి రోజువారి సూచనలు అందించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లను అనుమతించారాదని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు ఆయా మండలాల మండల విద్యాధికారులు ఉన్నారు.

## మతసామరస్యానికి పండగలు ప్రతీకలు

పెబ్బేరు ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి





**పెబ్బేరు, మార్చి 28 ప్రభాతవార్త :** మతసామరస్యానికి పండుగలు ప్రతీకలుగా మిగులుతాయని వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తరఫున పెబ్బేరు మండల కేంద్రంలోని మసీదులో, ప్రభుత్వం తరఫున సహారా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే పండ్లను తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. హిందూ ముస్లిం తేడా లేకుండా ఇలాంటి పండుగలు కలిసి జరుపుకోవడం ఐక్యతకు నాందిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**గద్వాల, మార్చి28 ప్రభాతవార్త:** శుక్రవారము శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ, పరశురామస్వామి దేవస్థానము యందు హుండీల లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు వెంకటేశ్వరి, ఆలయ కార్యనిర్వా హణాధికారి ఆర్. పురెంధర్ కుమార్,ఆలయ చైర్మన్ వెంకట్రా ములు, ఆలయ కమిటీమెంబర్లు,యునియన్ బ్యాంకు అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, ప్రమోద్‌ఆఫీస్ అసిస్టెంట్‌గ, భక్తులు,ఆలయ సిబ్బంది,ఎస్‌విఎస్ సేవా సంఘం నిర్వాహకులు అభిలాష్ గ్రూప్ సమక్షంలో నిర్వహించారు. 65 రోజులకుగాను రూ. 27,78,778=00 రూపాయలు "మాత్రమే ఆదాయం వచ్చినదని అధికారులు తెలిపారు.ఇందులో నోట్ల ద్వారరూ 25,45 ,700=00 రాగా, నాణెముల ద్వారరూ 2,33,078=00 వచ్చింది. మొత్తం హుండీ లెక్కింపు ద్వార రూ 27,78,778=00 లు మాత్రమే వచ్చిందని, మిశ్రమ బంగారం 000027000, మిశ్రమ వెండి 000640000 వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపుల యందు గత సంవ త్సరం ఇదే సమయానికి గాను రూ.27,28,039/- వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం గత సంవత్సరం కంటే హుండీల ద్వారా ఆదాయము రూపాయలు సుమారు రూ. 50,739/- అధికంగా వచ్చిందని తెలిపారు.

## త్రైత సిద్ధాంతం వారి తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన మాజీ జెడ్పి చైర్ పర్సన్



**గద్వాల, మార్చి 28 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సరిత క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం త్రైతసిద్ధాంతము వారి తెలుగు క్యాలెండర్ ఉగాది పర్వదినం సందర్భంగా జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సరిత మాట్లాడుతూ గద్వాల జిల్లా ప్రజలందరికి మొదట ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భగవద్గీత లోని ప్రతి శ్లోకం పేదరిక పరిధిలోని ధర్మంలోని తెలియజేస్తాయి. తప్ప ఏ శ్లోకం శరీర పరిధి దాటి చెప్పలేదని దేహంలో కొలగల సోలార్ సూక్తులు వివరాలను తెలుపుకున్నదే భగవద్గీత విషయమానాలందరికి నిమిత్తం శాసన రూపముగానున్న శాస్త్రం,ఇది మత గ్రంథం కాదని, దైవ గ్రంథమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీనాయకులు తూంకుంట కృష్ణయ్యగౌడ్, జనార్ధన్‌రెడ్డి, బి.ఆర్.ఇమ్మనేయిల్, జమ్మిచేడు రాము, పాల్వాయి అయ్యప్ప, సత్యం, త్రైత సిద్ధాంత కమిటీ

## బార్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఘన సన్మానం

**నారాయణపేట టౌన్, మార్చి28 ప్రభాతవార్త :** నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ వరుసగా 5వ సారి ఎన్నిక కావడం పట్ల శుక్రవారం విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడుడా.రాంబాబు ఆధ్వర్యంలోశాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. రాంబాబు మాట్లాడుతూ ఏకధాటిగా 5 సార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులుగా దామోదర్ గౌడ్, నందు నామాజీ ఎన్నిక కావడం న్యాయ వాదులకు వారి పట్ల ఉన్న నమ్మకమే అన్నారు.వారికి శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కర్మన్న గౌడ్,రామచంద్రయ్య, భీంరెడ్డి, ప్రవీణ్ నామాజీ, విజయ భాస్కర్, శ్రీకాంత్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాల ద్వారా ప్రతి మండలానికి ఒక స్వయం ఉపాధి యూనిట్

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:** మహిళా సంఘాల ద్వారా ప్రతి మండలానికి ఒక స్వయం ఉపాధి యూనిట్ నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను సూచించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఏపియంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల స్వయం ఉపాధి, సాధికారత కొరకు ఎన్నో పథకాలు అమలు చేస్తూ మహిళా సంఘాలకు చెయుతనిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని వనపర్తి జిల్లాలోని ప్రతి మండలంలో స్వయం ఉపాధి యూనిట్ నెలకొల్పే విధంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలని ఎపియంలను ఆదేశించారు. పెట్రోల్ బంక్, గోదాములు, రైస్ మిల్లు లేదా మరేదైనా వ్యాపారం మొదలు పెట్టే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు యూనిట్లు నెలకొల్పేందుకుముందుకు వస్తె జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారాలు అందిస్తామని అవసరమైతే శిక్షణ సైతం ఇప్పిస్తామని తెలియజేశారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అత్యధికంగా ఐకెపి వారికి కేటాయిస్తామని తెలియజేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా ఉండేందుకు ఏఈవోల ద్వారా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని కొనుగోలు కేంద్రాల ఇంఛార్జులు ఈ శిక్షణలో తప్పనిసరిగా పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ఈసారి మంచి నాణ్యమైన గన్ని బ్యాగులు అందజేస్తామని తెలియజేశారు. వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారిలో చనిపోయిన వారి స్థానంలో జీవించి ఉన్న వారి భాగస్వామికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయడంలో అలసత్వం వద్దని ఆదేశించారు. వనపర్తి జిల్లాలో 451 మంది మరణించిన వృద్ధాప్య పెన్షన్ కేసులు పెండింగ్‌లోఉన్నాయని, గ్రామంవారిగా వారి వివరాలు సేకరించి,మరణ ధృవీకరణ పత్రము, ఆధార్ కార్డు, భాగస్వామి బ్యాంక్ ఖాతా ఎంపీడీవో కార్యాలయంలో అందిస్తే ఏప్రిల్ 10 లోగా వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని సూచించారు. వచ్చే విద్య సంవత్సరానికి పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు మహిళా సంఘాలకు ఆర్డరు ఇవ్వడం జరిగిందని, ఏ పాఠశాల విద్యార్థులకు ఎవరు బట్టలు కుట్టాలో మ్యాచింగ్ బ్యాచింగ్ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి కొలతలు తీసుకొని విద్యార్థికి సరిపోయిన విధంగా బట్టలు కుట్టేవిధంగా చూడాలని సూచించారు. జూన్ 2 లోగా కనీసం ఒక జత యూనిఫారం సిద్ధం అయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, పిడి డిఆర్డిఏ ఉమాదేవి, డిపిఎం అరుణ ఏపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన ఉగాది కవి సమ్మేళనం



ఉగాది పండుగ కవి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



**కొల్లాపూర్, మార్చి28 ప్రభాతవార్త :** మంగళకరమైన మామిడి తోరణాలతో, మధుమాసపు కోయిల కూతలతో, హాయిని గొలుపే వాసంత సమీరంతో, కష్టసుఖాలను సమంగా భరించగలమనే విశ్వాసాన్ని కలిగించే షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనంతో, భవిష్యత్తుకు మార్గదర్శనం చేసే పంచాంగ శ్రవణంతో,మదినిండా పరుచుకున్న కోటి ఆశలతో వస్తున్న నూతన సంవత్స రానికి స్వాగతం అంటూ పలువురు కవులు తమ కవితా గానాలను చేసి అందరినీ అలరించారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని శ్రావణి ఇందిరా దేవి ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి శ్రీ ఇమ్మానియేల్ సభాధ్యక్షత వహించారు. మాజీ జిల్లా ఉప విద్యా శాఖాధికారి రంగినేని పాపల్ రావు కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ, మనం జరుపుకునే పండగలు, ఉత్సవాలు మనలోని ఐక్యతకు చిహ్నాలని, అందరూ కలిసిమెలిసి ఉత్సాహవంతంగా జరుపుకోవడం వెనుక ఎంతో గొప్ప విషయాలు దాగి ఉన్నాయని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు శ్రీ వేదార్థం మధుసూదన శర్మ,డా. గుడెలి శీనయ్యలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్ప వని, వాటి యొక్క విలువలను విద్యార్థి దశ నుంచే నేర్పించి, భవిష్యత్ తరాలకు అందివ్వాలని అన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో మానవీయ, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించవచ్చుఅని అన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాది భూజల భాస్కర్‌రెడ్డి, కవులు డా.పి రామచంద్రరావు, ఆర్ వెంకటేశ్వర చారి,డా. వి. భాస్కరరావుఆమని కృష్ణ, వేములకోటయ్య, బృంగికృష్ణ ప్రసాద్, రాఘవేందర్,శ్రీదేవి,వరలక్ష్మి,రాణి,శ్రీ కుమారి, రాధ, కురుమయ్య, గంగయ్య తదితరులు తమ కవిత గానాలను వినిపించారు.

## ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న దామరగిద్ద పోలీసులు



**నారాయణపేట టౌన్, మార్చి 28 ప్రభాతవార్త :** ఏలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నారాయణపేట మండలం పేరపళ్ళ మీదుగా టీజీ 38 టి 2277 నెంబర్ గల టిప్పర్ దామరగిద్దకు వస్తుండగా దామరగిద్ద పోలీస్‌లు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో శుక్రవారం పోలీస్ స్టేషన్ మలుపు దగ్గర ఏలాంటి ప్రభుత్వ అనుమతులు లేని ఇసుక లోడుతో గల టిప్పర్ పట్టుకుని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఓనర్ రమేష్, టిప్పర్ డ్రైవర్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్సైరాజు తెలిపారు.అనంతరం ఎస్సై మాట్లాడుతూ దామ రగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమ తులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలుతీసుకోవడంజరుగుతుందనిఎస్సై తెలిపారు.

## ప్రభుత్వం వరి కొనుగోలును సొసైటీలకే అప్పగించాలి

- సొసైటీల ద్వారా పలు రకాల రుణాలు
- పీఏసీఎస్ మహాజన సమావేశంలో విండో ఛైర్మన్ కదిరే



సమావేశంలో మాట్లాడుతున్న విండో ఛైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి

**భూత్పూర్,మార్చి 28,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వరికొనుగోలు ప్రక్రియను మహిళా సంఘాలకు కాకుండా పీఏసీఎస్‌లకు అప్పగించాలని భూత్పూర్ పీఏసీఎస్ చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు.సొసైటీలు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు వరికొనుగోలును సొసైటీలకే అప్పగించాల్సి న అవసరముందని పేర్కొన్నారు.శుక్రవారం భూత్పూర్ పీఏసీఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటైన మహాజన సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు.ఈ సందర్భంగా కదిరే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా భూత్పూర్ సొసైటీ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని అన్నారు.తమ సొసైటీ ద్వారా డైరెక్టర్ల పిల్లల ఉన్నత చదువుల కోసం విద్యా రుణాలిస్తున్నామని తెలిపారు.సమావేశానికి హాజరైన మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ఏడాదిలో మూడు పంటలకు రుణమాఫీని వర్తింపజేయాలని కోరారు.రైతు బంధు నిధుల్ని అర్హులైన రైతులకు ప్రభుత్వం వెంటనే అందించే చర్యలు చేపట్టాలని అన్నారు.ఇంకా ఈ సమావేశంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు రైతులు,బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళీధర్‌గౌడ్ తదితరులు ప్రసంగించగా,మాజీ కౌన్సిలర్ తూము శ్రీనివాస్‌రెడ్డితోపాటు డైరెక్టర్లు గడ్డంరాములు,రాంరెడ్డి,పీఏసీఎస్ సెక్రటరీ,సీఈఓ రత్నయ్య,సహాయకుడురెడ్డికుంట వెంకటేష్ పాల్గొన్నారు.

## కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

◆టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

**రాజాపూర్, మార్చి 28 ప్రభాతవార్త:** కష్టపడ్డ పార్టీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ప్రతి కార్యకర్త పార్టీ అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ అన్నారు.శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు మూడు అంశాలపై అవగాహన కార్యక్రమం పార్టీ పరంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్, పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై రివ్యూ



**చిన్నంబావి, మార్చి 28 ప్రభాతవార్త :** మండల పరిషత్ కార్యాలయం నందు మండల పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి మండల ఉన్నతాధికారులు రివ్యూ మీటింగ్ తీసుకోవడం జరిగింది. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంపై, అలాగే ఉపాధి కూలీలకు సరైన వేతనం వచ్చే విధంగా వారికి పనుల పైన అవగాహన కల్పించాలని సూచించడం జరిగింది. ఎండాకాలం ప్రారంభమైనందున గ్రామంలో నీటి ఎద్దడి పైన ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని అందుకు గ్రామంలో మిషన్ భగీరథ లీకేజీలు ఎప్పటికప్పుడు సరి చేస్తూ ఉండాలని, బోరు బావులను తక్షణమే వాడుకలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రైవేటు బోర్లను గుర్తించి ఉంచుకోవాలని సూచించడం జరిగింది. తదుపరి మార్చి నెల ముగుస్తున్నందున అన్ని గ్రామాలలో ఇంటి పన్ను వసూలు పూర్తిచేయాలని మరియు వసూలు చేసి పన్నును చలానా ద్వారా ట్రెజరీ నందు జమ చేసేదానికి చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో రమణారావు,మండల పంచాయతీ అధికారి రామస్వామి, ఎఇ (ఆర్‌డబ్ల్యుఎస్), ఎపిఓ (ఈజిఎస్) పాల్గొనడం జరిగింది.



పంచాయతీ కార్యదర్శులకు రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

## కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండానే సన్నబియ్యమా..?!

◆ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు



**గద్వాల, మార్చి 28 ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఉదరగొట్టే ప్రసంగాలు ఇచ్చి ఓట్లేయించుకొని అధికారం లో వచ్చి ఇచ్చిన వాగ్దానాలు ఎగ్గొట్టే ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు విమర్శించారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని డికె.బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు తపాల రామాంజనేయులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ లో బీపీఎల్ పేరిట రేషన్ కార్డులు ఇవ్వకుండా జాప్యం చేసి బీద, బడుగులను బజారున పడేసింద్రు అన్నారు. బీఆర్ఎస్ తప్పు చేసిందని మీకు అధికారం కట్టబెడితే మీరు కూడా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తూ కొత్త రేషన్ కార్డులు జాప్యం చేశారు.రేషన్ కార్డ్ ప్రభుత్వ లబ్ది పొందాలంటే రేషన్ కార్డ్ తప్పని సరి అని ఈ ప్రభుత్వాలకు తెల్వద..మీరిచ్చిన 6 గ్యారెంటీలు బడుగులకు రావాలంటే రేషన్ కార్డ్ తప్పని సరి అలాంటి రేషన్ కార్డ్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ దాటవేత ధోరణి తో ప్రవర్తిస్తున్న మీది సిగ్గుమాలిన చర్య,సిగ్గులేని ప్రభుత్వం. 2023 డిసెంబర్ నుంచి మొదలుకొని 2025 జనవరి దాకా రేషన్ కార్డ్ దరఖాస్తులకె పరిమితం చేసి బలహీన వర్గాలను మోసం చేయడం మీకు సిగ్గనిపిస్తలేదాని ప్రశ్నించారు. జనవరి 26, ఫిబ్రవరిలో ,మార్చి 1వ తేదీన ఇస్తున్నాము అంటూ ఉదరగొట్టి ఒక్క కొత్త రేషన్ కార్డ్ కూడా ఇవ్వలేకపోయింది, ఈ ప్రభుత్వం అని విమర్శించారు. మళ్ళీ ఈ అసమర్ధ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తున్నాం అంటూ కొత్త రేషన్ కార్డ్ లు ఇవ్వకుండా జాప్యం చేస్తు, మాటలతో పబ్బం గడుపుతున్నదన్నారు. మీకు పరిపాలించే అర్హత లేదని విమర్శించారు. ఉగాది పండుగ లోపు కొత్త రేషన్ కార్డ్ లు ఇచ్చి, వచ్చే ఏప్రిల్ లో కొత్త వారికి, పాత వారికి అందరికి సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డ్ పంపిణీ లో జాప్యం జరిగితే బీజేపీ పార్టీ తరపున ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ,కేకేరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవా దాస్, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్, బిజెపి నాయకులు ఢిల్లీవాల క్రిష్ణ, డబ్బిలేటి నరసింహ, మోహన్, కోట్ల విరేశ్ ,నరసింహ శెట్టి, వాసు, మండల అధ్యక్షుడు చెనుగోనిపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

## గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్లో చేర్చడం హర్షణీయం

◆ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ ఛైర్మన్ లింగం నాయక్
◆ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, మార్చి 28 ప్రభాతవార్త:** గోర్ బోలి లంబాడ భాషను 8వ షెడ్యూల్లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టడం హర్షనీయమని జిల్లా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ లింగం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, బెల్లయ్య నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా చైర్మన్ లింగం నాయక్ మాట్లాడుతూ దేశంలోని 11 రాష్ట్రాల్లో 15 కోట్ల మంది లంబాడి భాష మాట్లాడుతారని అన్నారు. హిందీ తర్వాత ఎక్కువగా మాట్లాడేది లంబాడి భాషయేనని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గోర్‌బోలి లంబాడ భాషను 8వ షెడ్యూల్ చేర్చడాన్ని ధన్యవాదాలు తెలుపుతున్నాం. రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదం పొంది గోర్ బోలి లంబాడ భాషను 8వ షెడ్యూల్లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ రాములునాయక్,పట్టణ అధ్యక్షులు పాతావత్ రవినాయక్, మాజీ జెడ్పీటీసీ చందర్ నాయక్, నాయకులు యాదగిరి నాయక్, రాంచందర్ నాయక్, గోవర్ధన్ నాయక్, డాక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన హెచ్‌ఎంకు పీఆర్‌టీయూ టీఎస్ సన్మానం

**భూత్పూర్,మార్చి 28,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తమొల్గర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న ఆహ్మద్ అజీజ్ ఇకామత్‌ను మండల పీఆర్‌టీయూ టీఎస్ భూత్పూర్‌శాఖ అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారిణి ఉషారాణి హాజరై పదవీ విరమణ పొందుతున్న అజీజ్ ఇకామత్‌ను పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు.హెచ్‌ఎంగా ఇకామత్ ఒనరించిన సేవల్ని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టయూ టీఎస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌తో పాటు ప్రధాన కార్యదర్శి పి కృష్ణ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

